# సాక్షి కర్నూలు

గురువారం । 14 । మార్చి । 2024




### ఆదాయం రూ. 58 లక్షలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో భక్తులు సమర్పించిన కానుకలకు బుధవారం లెక్కించారు. ఇందులో రూ.58,64,029 నగదు, 13 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి.



### హంద్రీనదికి ఎల్లెల్సీ నీరు

కోడుమూరు రూరల్: కోడుమూరు, వర్కూరు, గోరంట్ల గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా తుంగభద్ర దిగువ కాలువ నుంచి 40 క్యూసెక్కుల నీటిని హంద్రీ నదిలోకి విడుదల చేస్తున్నారు.



### ఏప్రిల్ 6 నుంచి ఉగాది ఉత్సవాలు

శ్రీశైలం టెంపుల్: వచ్చే నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు శ్రీశైల దేవస్థాన ఈఓ డి. పెద్దిరాజు తెలిపారు. ఏర్పాట్లపై బుధవారం సమీక్ష నిర్వహించారు.

### రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ | సహెర్ |
|---|---|---|
| కర్నూలు | సా॥ 6:31 | ఉ॥ 5:02 |
| ఆదోని | సా॥ 6:34 | ఉ॥ 5:05 |
| నంద్యాల | సా॥ 6:31 | ఉ॥ 4:59 |
| ఆత్మకూరు | సా॥ 6:29 | ఉ॥ 5:00 |
| బనగానపల్లె | సా॥ 6:32 | ఉ॥ 5:00 |

**హదీస్ వెలుగు :**

అల్లాహ్ మీరు చేసే పనులు గమనించడం లేదని అనుకోవద్దు. అమావాస్య చీకటిలో నల్లటి రాతికొండ కింద ఉన్న నల్ల చీమనూ చూస్తుంటారు. – పవిత్ర ఖురాన్

# అగ్రవర్ణ పేదలకు ఆర్థిక నేస్తం

- ఏటా అందుతున్న సాయం
- నేడు ఈబీసీ నేస్తం 3వ విడత విడుదల
- బనగానపల్లెలో బటన్ నొక్కనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- జిల్లాలో 6,944 మంది లబ్ధిదారుల ఖాతాలో జమకానున్న రూ.10.41 కోట్లు



రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కులాల (ఈబీసీ) మహిళల ఆర్థిక పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నవరత్నాల'తో పాటు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేద మహిళలు కూడా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి ఆర్థికంగా తోడయ్యేందుకు వీలుగా ప్రభుత్వం 'వైఎస్సార్ ఈ బీసీ నేస్తం'పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకాన్ని 2021–22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించి వరుసగా మూడేళ్లు నిర్విరామంగా కొనసాగిస్తోంది. వైఎస్సార్ చేయూత, కాపు నేస్తంలో ఉన్న లబ్ధిదారులతో పాటు వివిధ పథకాల కింద లబ్ధి పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలను మినహాయించి కేవలం బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి, కమ్మ, వెలమ, మరాఠ, మార్వాడీ తదితర 308 అగ్రవర్ణ కులాల్లోని పేద మహిళలకు ఈ పథకం వర్తింపజేస్తోంది.

– కర్నూలు(అర్బన్)

**ఈబీసీ నేస్తం కింద ఇప్పటి వరకు విడుదలైన మొత్తం**

| సంవత్సరం | లబ్ధిదారుల సంఖ్య | విడుదలైన మొత్తం |
|---|---|---|
| 2021-22 | 6245 | రూ.9,36,75,000 |
| 2022-23 | 7000 | రూ.10,50,00,000 |

**14న విడుదల కానున్న మొత్తం...(2023-24 ఆర్థిక సంవత్సరానికి)**

**జిల్లాలో 6,944 మంది లబ్ధిదారులకు రూ.10,41,60,000**

**అతి స్వల్ప నిబంధనలతో..**

అగ్రవర్ణాల్లోని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన మహిళలు 45 నుంచి 60 ఏళ్లలోపు వారై ఉండి, కుటుంబ నెల వారి ఆదాయం గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు కలిగిన వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. ప్రభుత్వం జారీ చేసిన సమగ్ర కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు ఉండి ఏదైనా బ్యాంకులో ఖాతా కలిగి ఉంటే చాలు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి రూ.15 వేల ప్రకారం మూడు విడతల్లో రూ.45 వేలను అందించాలని తీసుకున్న నిర్ణయం మేరకు ఏయేటికాయేడు లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం విడుదల చేస్తూనే ఉంది.

**మూడో విడత బనగానపల్లెలో ప్రారంభం**

వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద 3వ విడత నిధులు ఈ నెల 14న విడుదల కానున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో ఈ పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి డీబీటీ సిస్టమ్ ద్వారా నేరుగా నగదును జమ చేయనున్నారు.

### ఎంతో ఉపయోగం



వైశ్య కులానికి చెందిన మాలాంటి పేదలకు ఈబీసీ నేస్తం పథకం కింద అందిస్తున్న రూ.15 వేలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఇంటి వద్దే చిన్న అంగడి పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. రోజుకు రూ.500 వరకు వ్యాపారం జరుగుతోంది. మా అబ్బాయికి మాటలు రాకపోవడం వల్ల నెలకు రూ.3 వేలు పెన్షన్ వస్తోంది. వృద్ధాప్యంలో ఇతర పనులు చేసుకోలేం. ఈ చిన్న వ్యాపారంతో వచ్చే ఆదాయం, కొడుకు పెన్షన్‌తో జీవిస్తున్నాం. – అచోలి సువర్ణమ్మ, కవాడీ స్ట్రీట్, కర్నూలు

### 6,944 మందికి లబ్ధి



జిల్లాలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద 3వ విడతలో 6,944 మంది లబ్ధిపొందుతున్నారు. ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.10.41 కోట్లు జమ కానున్నాయి. ఈనెల 14న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకానికి సంబంధించిన నగదును నంద్యాల జిల్లా బనగానపల్లెలో బటన్‌నొక్కి లబ్ధిదారు ఖాతాలో జమ చేయనున్నారు.

– బీసీ కార్పొరేషన్ ఈడీ పీ వెంకటలక్షుమ్మ

# నేడు కర్నూలుకు సీఎం వైఎస్ జగన్

- జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం కర్నూలు రానున్నారు. గన్నవరం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి కర్నూలులో ఏర్పాటు చేయనున్న జాతీయ విశ్వ విద్యాలయానికి హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. అక్కడ ప్రజాప్రతినిధులతో మాట్లాడిన అనంతరం జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



సీఎం జగన్ ఆవిష్కరించనున్న పైలాన్

సీమ వాసుల ఆకాంక్ష నెరవేర్చే విధంగా కర్నూలులో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం జగన్నాథగట్టుపై 100 ఎకరాలను కేటాయించింది. అందులో భవన నిర్మాణాలను ఆరు నెలల్లో పూర్తి చేసి.. 2025–26 విద్యా సంవత్సరం నుంచి తరగతులను ప్రారంభించే విధంగా ప్రణాళిక రూపొందించింది. కర్నూలులో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటు కానుండటంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సీఎం పర్యటనకు పటిష్ట భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, మేయర్ బీవై రామయ్య, జేసీ మౌర్య తదితరులు

కర్నూలు కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు అధికారులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. జగన్నాథ గట్టుపై హెలిప్యాడ్, సభాస్థలి వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డి.సృజన, నగర మేయర్ బీవై రామయ్య, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఐజీ సీహెచ్ విజయరావు, నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ, ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలవడానికి వచ్చే ప్రముఖులను ఒక పద్ధతి ప్రకారం తీసుకుపోయే ఏర్పాట్లు ఉండాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. రోప్ పార్టీ చాలా చురుగ్గా వ్యవహరించాలన్నారు. ముఖ్యమంత్రి సెక్యూరిటీ అధికారుల సూచనల మేరకు ప్రాంగణం మొత్తం బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ న్యాయ విశ్వ విద్యాలయ ప్రాజెక్టు డైరెక్టర్ జయరాం రెడ్డి, సీఎం సెక్యూరిటీ అధికారి విశ్వనాథం, డీఎస్పీ విజయశేఖర్, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్, కల్లూరు తహశీల్దార్ మునివేలు, విద్యుత్ శాఖ డీఈ సుబ్బన్న, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నేషన్ లా వర్సిటీ నిర్మాణ ప్రాంతంలో నూతనంగా వేసిన రోడ్డు



సీఎం పర్యటకు సిద్ధమైన హెలిప్యాడ్



రూపుదిద్దుకున్న వేదిక



ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఐజీ, కలెక్టర్, ఎస్పీ

## న్యూస్‌రీల్

### 'గురు' వైభవం.. భక్తిపారవశ్యం



మూలరాముల పూజలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి వైభవోత్సవాలు బుధవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. వేడుకల్లో భాగంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం రాఘవేంద్ర మూలబృందావనానికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపారు. అనంతరం పూజమందిరంలో మూల , జయ, దిగ్విజయ రాముల పూజలు నిర్వహించారు. పూజోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలను పురస్కరించుకుని పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. యోగీంద్ర మంటపంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఏఓ మాధవ శెట్టి, శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి పాల్గొన్నారు.

### 15, 16 తేదీల్లో 694 మంది ఉద్యోగులకు స్క్రీనింగ్ టెస్ట్

కర్నూలు(అగ్రికల్చర్): అనారోగ్య కారణాల కారణంగా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరుతున్న 694 మంది ఉద్యోగులకు ఈ నెల 15, 16 తేదీల్లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్ర రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు సీ.క్యాంపులోని హెల్త్ డిస్పెన్సరీలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారని, స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కాకపోతే ఎన్నికల విధులకు హాజరుకావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

### వైఎస్ఆర్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): వైఎస్ఆర్‌టీయూసీ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు లభించింది. వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి. శ్రీనివాసులును నియమించారు. అలాగే కార్యదర్శిగా పి.ఎండి. ఆరిఫ్ ఖాన్, సంయుక్త కార్యదర్శిగా జి. అబ్దుల్ జబ్బార్‌లను నియమిస్తూ బుధవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో విడుదల చేసింది.

## కర్నూలులో త్రిదండి చిన్న జీయర్ స్వామి

కర్నూలు కల్చరల్: శ్రీ గోదాదేవి సమేత రంగనాథ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు బుధవారం త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి కర్నూలు వచ్చారు. స్వామీజీకి గోదాగోకులం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం, శేష వాహన సేవ, తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులు కల్పవృక్ష వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించారు. శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేష్ బట్టర్, కిరణ్ బట్టర్ బృందంలో ఈ క్రతవులు నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామి,



త్రిదండి చిన్న జీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న గోదా గోకులం నిర్వాహకులు

గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్దన్, తల్లం సురేష్, తలుపుల శ్రీనాథ్, వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## 43 పోలింగ్ స్టేషన్ల మార్పు

కర్నూలు కల్చరల్: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి 43 పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పు చేశామని, అలాగే 107 పోలింగ్ స్టేషన్ల పేరు మార్చామని జిల్లా ఎలక్టోరల్ అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 18 ఆక్సిలరీ (సహాయక) పోలింగ్ స్టేషన్లకు అనుమతి వచ్చిందన్నారు. కంప్లయింట్ సెల్, మీడియా మానిటరింగ్ సెల్, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బంది**

ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బందిని సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని పోలింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌పై సంబంధిత నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టు, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బంది వివరాలు కూడా సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలనన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫారమ్స్ డిస్పోజల్‌పై దృష్టి సారించాలని అధికారులను టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. జిల్లాలో ఎమ్ఎస్ఎమ్ఈలలో పురోగతి తీసుకురావాలన్నారు. జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అర్హులైన జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలం అందజేస్తామన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు శేషిరెడ్డి, రామలక్ష్మి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి గుమ్మనూరుకు షాక్!



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విరూపాక్షి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఆలూరు: ఇటీవల టీడీపీలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు స్వగ్రామంలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఆయన స్వగ్రామమైన చిప్పగిరి మండలం గుమ్మనూరుకు చెందిన టీడీపీ నాయకులు కొలిమి శ్రీనివాసులు, రఘు, 50 మంది కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ ఆలూరులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు బూసినే విరూపాక్షి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల ప్రజలకు అన్ని రకాలుగా అండగా నిలిచేది వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. టీడీపీలో ఎన్నేళ్లు కొనసాగినా ప్రయోజనం ఉందని గ్రహించి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. వచ్చే ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, చిప్పగిరి సింగిల్ విండో అధ్యక్షుడు మల్లికార్జున, పార్టీ నాయకులు లాల్‌స్వామి, నారాయణ స్వామి, మంజు, ప్రసాద్, సుంకన్న, పెన్నయ్య, బొంబాయి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## జొన్న రైతుకు మరింత భరోసా

కర్నూలు(అగ్రికల్చర్): జొన్న రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2023–24లో పండించిన జొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేసే ప్రక్రియను మరింత విస్తృతం చేస్తోంది. ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ డీసీఎంఎస్ ద్వారా జొన్నలు కొనుగోలు చేస్తోంది. మరోవైపు జొన్నలు పండించిన ప్రతి రైతుకు మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను కూడా రంగంలోకి దింపుతోంది. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కర్నూలు జిల్లాలో దాదాపు 850 టన్నులు, నంద్యాల జిల్లాలో 5వేల టన్నులు మద్దతు ధరతో కొనుగోలు చేసింది. హైబ్రిడ్ జొన్నలకు కనీస మద్దతు ధర రూ.3,180, మలంది జొన్నలకు రూ.3,225 ఉంది. మద్దతు ధర మహేంద్ర రకాలకు చెందిన తినే జొన్నలకే వర్తిస్తుంది. మార్కెట్‌లో ప్రస్తుతం జొన్నల ధర రూ.2,600 మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవడం రైతులకు ఊరటనిస్తోంది. ఇప్పటికే నంద్యాల జిల్లాలో మార్క్‌ఫెడ్ జొన్నల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ఒకటి, రెండు రోజుల్లో కర్నూలు జిల్లాలోనూ కొనుగోళ్లు మొదలయ్యే అవకాశం ఉంది.



## టీడీపీ సోషల్ మీడియా వల్లే గీతాంజలి ఆత్మహత్య

- వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్
- గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల నిరసన



గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న కర్నూలు నియోజకవర్గ సమన్వయ కర్త ఇంతియాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు (టౌన్): టీడీపీ సోషల్ మీడియా వల్లే తెనాలికి చెందిన గీతాంజలి అనే మహిళ ఆత్మహత్య చేసుకుందని, ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్తు కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో బుధవారం గీతాంజలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. జోహార్ గీతాంజలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లక్షలాది మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించారన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ ఇంటి పట్టా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 33 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. ఇదే విషయాన్ని తెనాలికి చెందిన గీతాంజలి అనే మహిళ చెబుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాను చూపిస్తూ ఆనందం వ్యక్తం చేసిందన్నారు. పేదలకు ఏ ఒక్క మంచి పని చేయని తెలుగుదేశం, జనసేన నాయకులకు ఈ విషయం నచ్చలేదన్నారు. దీంతో గీతాంజలిని సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా వేధించారన్నారు. ఇది భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుందన్నారు. ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. సంఘటన గురించి తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ప్రకటించారన్నారు. పేద కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి సాధిస్తుంటే భరించలేని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు పద్ధతి మార్చు కోవాలని, లేదంటే ప్రజలు క్షమించబోరన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిమోహన్ రెడ్డి, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు, కరుణాకర్ రెడ్డి, తిరుమలేశ్వర రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జపాన్‌లో నర్సు ఉద్యోగాలు

కర్నూలు సిటీ: ఏఎన్‌ఎం/జీఎన్‌ఎం/బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి జపనిస్(ఎన్.ఎస్, ఎన్4, ఎన్3) భాషపై శిక్షణ ఇచ్చి జపాన్‌లో నర్సుల ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ వి.శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు https://www.apssdc.in/home/onlineprogramregitration అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్: 75690 68058 నంబరును సంప్రదించాలని కోరారు.

### వారంలో రెండు రోజులు మిర్చి విక్రయాలు

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇక నుంచి రెండు రోజులు మాత్రమే మిర్చి విక్రయాలు కొనసాగుతాయని యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మిర్చి యార్డులో కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు, వ్యాపారులతో ఆయన చర్చించారు.గతంలో బుధ, ఆదివారాల్లో విక్రయాలు జరిగేవని, ఆ తర్వాత సోమ, బుధ, శుక్రవారం ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం బుధవారం, శనివారం మాత్రమే మిర్చి మార్కెట్ యార్డులో లావాదేవీలు జరుగుతాయని స్పష్టం చేశారు, రైతులు ఈ విషయాన్ని గమనించి మిర్చి దిగుబడులను తీసుకురావాలని సూచించారు. కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, సభ్యులు వీరభద్రగౌడ్, రాజాగౌడ్, ఏజెంట్లు తాహెర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### 18లోపు జాబితా పరిశీలించాలి

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో గతంలో నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్ వైజర్స్, ఇన్‌స్ట్రక్టర్స్‌గా పని చేసిన అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాల ఆధారంగా తయారు చేసిన జాబితాలో వెబ్‌సైట్‌లో ఉంచామని, ఈ జాబితాపై ఈ నెల 18వ తేదీలోపు డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు పరిశీలించాలని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ సీహెచ్ విజయజ్యోతి కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ సెంటర్లు నడిచిన మండలాలకు చెందిన ఎంఈఓలు జాబితాలోని వారి వివరాలను రికార్డుల ఆధారంగా పరిశీలించాలన్నారు. జాబితాలో విద్యా అర్హతలు, ఇతర పత్రముల నకలు కాపీలను ధ్రువీకరించి సకాలంలో పంపించాలని ఆమె సూచించారు.

### రేపు ఆర్‌యూలో బీసీడీఈపై అవగాహన

కర్నూలు కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (బీసీడీఈ) కార్యక్రమంపై శుక్రవారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో అవగాహన కల్పిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న తెలిపారు. దీంతో పాటు లెర్నింగ్ ఇంప్రూవ్ మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు తెలిపారు. ఆర్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో అమలవుతున్న ఈ కార్యక్రమంపై కళాశాల ప్రిన్సిపాళ్లు, బీసీడీఈ కళాశాలల కోఆర్డినేటర్లు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్, రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.టి.కె.నాయక్, బీసీడీఈ కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణాధికారి, ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎస్. దేవకుమార్ అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

# ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోగా పనుల గ్రౌండింగ్

- మంచి నీటి పథకాల నిర్వహణ పొడిగింపునకు ప్రతిపాదనలు
- గ్రామాల్లో నీటి అవసరాలకు మెటీరియల్‌ను సిద్ధం చేసుకోండి
- ఎంసీసీ నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ జీ.నాసరరెడ్డి
- హుందాగా సాగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి



హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు

కర్నూలు(అర్బన్): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను గ్రౌండింగ్ చేయాలని జిల్లా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) నోడల్ అధికారి, జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి కోరారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ ముజాఫర్ నాయక్ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా 1, 7వ స్థాయీ సంఘ సమావేశాల్లో సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ.. త్వరలో ఎన్నికల షెడ్యూల్ రానుందని, అంతలోపే గ్రౌండింగ్ ప్రక్రియలో భాగంగా ముందుగా ఆయా పనులను చేపట్టేందుకు వీలుగా అగ్రిమెంట్ పూర్తి అయి ఉండాలని, అలాగే పనులు చేపట్టే ప్రదేశంలో మెటీరియల్ సిద్ధంగా ఉండాలన్నారు.

#### మంచి నీటి పథకాల నిర్వహణ పొడిగింపునకు ప్రతిపాదనలు

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మొత్తం 59 సమగ్ర రక్షిత మంచి నీటి పథకాల (సీపీడబ్ల్యూఎస్) నిర్వహణకు సంబంధించి ప్రతి ఏడాది ఏప్రిల్ నెలలో టెండర్లను ఆహ్వానించాల్సి ఉందని సీఈఓ చెప్పారు. అయితే ఏప్రిల్ నెలలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండే అవకాశం ఉన్నందున ప్రస్తుతం ఆయా మంచి నీటి పథకాలను నిర్వహిస్తున్న ఏజెన్సీలకే మరో మూడు నెలల (ఏప్రిల్, మే, జూన్) వరకు నిర్వహణ బాధ్యతలను పొడిగించేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుంటామన్నారు. ఈ నేపథ్యంలోనే ముందుగా స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీటీసీల ఆమోదం కోరుతున్నామన్నారు. ప్రస్తుత వేసవిలో ఎక్కడా తాగు నీటి పథకాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. సీఈఓ నాసరరెడ్డి ప్రతిపాదనలపై సమావేశాలకు హాజరైన జెడ్పీటీసీలు ఆమోదం తెలిపారు. అలాగే .. ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వచ్చిన అనంతరం ఎలాంటి కొత్త పనులు చేపట్టేందుకు వీలుండదన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయి ? ఏ రకమైన మెటీరియల్ అవసరం ? అనే విషయాలపై క్షేత్ర స్థాయిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎంపీడీఓలు చర్చించుకొని అవసరమైన మెటీరియల్‌ను ఇప్పుడే కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ వద్ద నిధులు ఉన్నా, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఖర్చు చేసేందుకు వీలుండదన్నారు.

#### స్థాయీ సంఘ సమావేశాలకు గైర్హాజరు అయితే ఎలా ...

గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి వేదిక అయిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు గైర్హాజరు అయితే ఎలా అని సీఈఓ నాసరరెడ్డి ప్రశ్నించారు. ఆయా శాఖలకు చెందిన అధికారులకు అతి ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు ఉంటే తప్పనిసరిగా సమాచారం తెలియజేసి ద్వితీయ శ్రేణి అధికారులు సమావేశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. పలువురు ఎలాంటి సమాచారం అందించకపోగా, స్థాయీ సంఘ సమావేశాలంటే లెక్కలేని విధంగా కార్యాలయ సిబ్బందిని సమావేశాలకు పంపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు కేటాయించిన సమయానికి సంబంధిత శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని కోరారు.

– సమావేశాలకు 5వ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ పీ దివ్య. జెడ్పీటీసీ సభ్యులు ఎస్ సుధాకర్‌రెడ్డి, డీ సుంకన్న, బీ ఉరుకుందమ్మ, డీ మురళీధర్‌రెడ్డి, జీ శివశంకర్‌రెడ్డి, పీ జగదీశ్వర్‌రెడ్డి, పీ యుగంధర్‌రెడ్డి, కేవీఆర్ మహేశ్వరరెడ్డి, పీ అనసూయమ్మ, రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీ నాగేశ్వరరావు, పీఆర్ ఈఈ మద్దన్న, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు, ఏపీఎస్‌ఆర్‌టీసీ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జే రంగలక్ష్మిదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ లక్ష్మినారాయణ, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రామచంద్రయ్య, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబీహా పర్వీన్ తదితరులు హాజరయ్యారు.

### చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



కర్నూలు : రైలు ప్రమాదంలో గాయాలకు గురైన ఓ గుర్తు తెలియని వ్యక్తి కోలుకోలేక బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. ఈనెల 9వ తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో మానవపాడు రైల్వే స్టేషన్‌లో లూప్ లైన్ మధ్య గాయాలతో పడి ఉండగా 108 అంబులెన్స్‌లో తీసుకువచ్చి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. వ్యక్తికి సంబంధించిన వివరాలు ఏమీ తెలియవు. సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండి ట్రూ బ్లూ బ్రాండ్‌తో నీలిరంగు పూలమొక్క డిజైన్ కలిగిన తెలుపు రంగు ఫుల్‌షర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు వీఏఎస్ బ్రాండ్ లేత బూడిద రంగు కట్ బనియన్ ధరించాడు. నలుపు, తెలుపు మొలతాడు, కుడి చేతిపై, ఎడమ పక్క ఛాతీపై అరుణ అని తెలుగులో పచ్చబొట్టు ఉంది. గుర్తు తెలియని రైలు నుంచి ఇతను ప్రమాదవశాత్తు జారిపడి ఉండొచ్చునని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కర్నూలు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. వివరాలు తెలిసినట్లయితే 8309067184 లేదా 8712658608 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని గద్వాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## కర్నూలులో సందడి చేసిన సంయుక్త మీనన్



షాపింగ్‌మాల్‌లో చీరలను చూస్తున్న సినీతార సంయుక్త మీనన్

- జీవీ మాల్ షోరూం ప్రారంభం

కర్నూలు (న్యూటౌన్): సినీ నటి సంయుక్త మీనన్ బుధవారం కర్నూలులో సందడి చేశారు. నగరంలో జీవీ మాల్ షోరూం ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా వచ్చారు. రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలనతో షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరికొత్త డిజైన్స్‌తో షోరూం ఫ్యాషన్ ప్రపంచాన్ని మైమరించేలా ఉందన్నారు. ఇక్కడ అరుదైన డిజైన్ల శారీస్ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ..కర్నూలు నగరం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దలందరికీ అందుబాటులో ధరల్లో వస్త్రాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాతృ వియోగం

తల్లి ఎల్లారెడ్డి లలితమ్మతో కుమారులు ఆదోని, మంత్రాలయం, గుంతకల్లు ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ సీతారామిరెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డి లలితమ్మ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆమె మృదేహం వద్ద ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఆయన కుమారుడు మనోజ్‌కుమార్ రెడ్డి

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలకు భద్రత కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు బుధవారం కూడా మూడు పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో కవాతు నిర్వహించారు. కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు రేమడూరు, పుసులూరు, బొల్లారం, బస్తిపాడు, ఎమ్మిగనూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కున్నూరు, పత్తికొండ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఎద్దులదొడ్డి, పెండేకల్లు, రాంపల్లి, ఆర్‌ఎస్ పెండేకల్లు, గొందిమడుగుల, మారెల్ల, ముక్కెల్ల గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో సెంట్రల్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ నవీన్‌దాస్, సీఐలు కిరణ్ కుమార్ రెడ్డి, రామకృష్ణయ్య, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేష్‌తో పాటు స్థానిక పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బస్తిపాడులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ పోలీసు బలగాలు

### బాలింత ఆత్మహత్య

- విషపూరితమైన చనుపాలు పట్టడంతో మూడు నెలల శిశువు మృతి



మృతి చెందిన ఇందుమతి

ఆళ్లగడ్డ: కన్న తల్లి చనిపోవడంతో మానసికస్థితి సరిగా లేక జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు విషం తీసుకుంది. ఇంతలోనే మూడు నెలల కన్న బిడ్డ ఏడుస్తుండటంతో చనుపాలు పట్టగా విషం తీసుకున్న తల్లి, విషపూరితమైన పాలు తాగిన చంటిబిడ్డ మృత్యువాత పడ్డారు. ఈ ఘటన శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇందుమతి(23)ని నాలుగు సంవత్సరాల క్రితం చాగలమర్రి మండలం తోడెండ్లపల్లి గ్రామానికి చెందిన గడ్డం సతీష్‌రెడ్డితో వివాహమైంది. వీరికి రెండు సంవత్సరాల క్రితం ఒక బాబు జన్మించగా.. ఈ ఏడాది తిరిగి గర్భం దాల్చగా నాలుగు నెలల క్రితం కాన్పు కోసం పుట్టింటికి వచ్చింది. ఇక్కడికి వచ్చినప్పటి నుంచి గత సంవత్సరం మృతి చెందిన తల్లిని తలుచుకుంటూ మానసికంగా ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలో మూడు నెలల క్రితం ఆడపిల్లను ప్రసవించింది. అయినప్పటికీ మానసికస్థితి సరిగా లేకపోవవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఇంట్లో ఉన్న కళ్లాపు నీళ్లలో కలిపే కెమికల్ పొడిని నీళ్లలో కలుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే కొంత సమయానికి మంచంపై పడుకున్న మూడు నెలల చంటిబిడ్డ ఏడవటంతో కడసారి తన చనుపాలు తాగించాలని బిడ్డను ఎత్తుకుని పాలుపట్టింది. కొంత సేపటికే బిడ్డ మృతి చెందగా.. ఆమె కూడా అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఇందుమతిని గట్టిగా నిలదీయడంతో విషం తాగినట్లు చెప్పింది. దీంతో ఆమెను నంద్యాల వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఘటనపై మృతురాలి తండ్రి సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శిరివెళ్ల ఎస్ఐ సురేష్ తెలిపారు.

## రైతుల అభ్యున్నతికి సహకరించండి





సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం ఎం.సుబ్బారెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతికి నాబార్డు విశేషంగా కృషి చేస్తోందని, బ్యాంకులు ఆర్థికంగా చేయూతనిచ్చి సహకరించాలని డీడీఎం మోపూరు సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్ సమావేశ మందిరంలో బ్యాంకర్స్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా వాటర్‌షెడ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం 4 వాటర్‌షెడ్ ప్రాజెక్టులు అమలులో ఉన్నాయన్నారు. రెండు ట్రైబల్ డెవలప్‌మెంటు ప్రాజెక్టులు, 33 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, నాలుగు రైతు బజార్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలు మరింత రాణించేందుకు వీలుగా బ్యాంకులు కూడా రుణాలు ఇచ్చి సహకరించాలని కోరారు. వ్యవసాయ అనుబంధ శాఖలు అమలు చేసే స్కీమ్‌లను కూడా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మంజూరు చేస్తే రైతులు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులు, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ భవానిశంకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అగ్రానమీ ఏడీ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## గొంతుకోసి కన్న బిడ్డను కడతేర్చిన తండ్రి



మృతి చెందిన వర్షిత (ఫైల్)



తండ్రి శాంతిరాజు

కోసిగి: తాగుడుకు బానిసైన ఓ తండ్రి మృగంలా మారాడు. కత్తితో కన్న బిడ్డ గొంతు కోసి ప్రాణాలు తీసిన ఘటన మండలంలోని జంపాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన దానియేలు, సారమ్మ దంపతుల కుమార్తె ఆశీర్వాదమ్మకు కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ తాలుకా కమలాపురం గ్రామానికి చెందిన మేనత్త కుమారుడు శాంతిరాజుతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అక్కడ కాపురం ఉండలేక మూడేళ్ల క్రితం ఆశీర్వాదమ్మ పుట్టినిల్లు జంపాపురానికి చేరుకుంది. శాంతిరాజు కూడా ఇక్కడికే వచ్చి వేరు కాపురం పెట్టి జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతుల సంతానం వర్షిత(2). కొద్ది కాలంగా శాంతిరాజు తాగుడుకు బానిసై భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలోనే తరచూ ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. మంగళవారం రాత్రి మద్యం తాగిన శాంతి రాజు ఇంట్లో నిద్రిస్తున్న కుమార్తెను పక్కనున్న గుడిసెలోకి తీసుకెళ్లి కత్తితో గొంతు కోసి కడతేర్చాడు. భార్య చర్చికి వెళ్లి ఇంటికి చేరుకునే సరికి కుమార్తె కనిపించకపోవడంతో ఆందోళనకు లోనైంది. పక్కనే ఉన్న గుడిసెలోకి వెళ్లి చూడగా వర్షిత రక్తపు మడుగులో కనిపించింది. తండ్రి కూడా అక్కడే ఉండటంతో జరిగిన ఘోరానికి కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. ఏఎస్ఐ నాగరాజు హత్య కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అదుపులో తీసుకున్నారు.

## బీటెక్ విద్యార్థి అనుమానాస్పద మృతి



విద్యార్థి బ్రహ్మసాయి రెడ్డి

దొడ్డబళ్లాపురం: బెంగళూరు శివార్లలో దొడ్డబళ్లాపురం వద్ద గల ఒక ప్రముఖ ప్రైవేటు యూనివర్సిటీలో కర్నూలు జిల్లాకు చెందిన దాసరి బ్రహ్మసాయి రెడ్డి (19) అనే విద్యార్థి అనుమానాస్పద రీతిలో మరణించాడు. మంగళవారం రాత్రి క్యాంపస్‌లోని హాస్టల్ భవనం మీద నుంచి పడడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బ్రహ్మసాయిరెడ్డి ఈ విశ్వవిద్యాలయంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాదవశాత్తు బిల్డింగ్ మీద నుంచి పడిపోయాడా అనేది మిస్టరీగా ఉంది. విద్యార్థి గదిలో ఎలాంటి లేఖ దొరకలేదని సమాచారం. మృతదేహాన్ని సెక్యూరిటీ, సిబ్బంది పోలీసులు రాకమునుపే అక్కడి నుంచి తొలగించడం పలు అనుమానాలు కలిగిస్తోంది. దొడ్డగ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకు,ని దర్యాప్తు చేస్తున్నారు.



## సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహం

**సోలార్ రూఫ్‌టాప్‌లపై విస్తృత ప్రచారం**

- సామర్థ్యాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.78 వేల రాయితీ
- జిల్లాలో 8.50 లక్షల మంది వినియోగదారులకు మొదటి ప్రాధాన్యత
- ఇప్పటికే దాదాపు 300 పైగా దరఖాస్తులు
- సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఉచిత విద్యుత్ లక్ష్యం



సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్

కర్నూలు(అగ్రికల్చర్): సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. దిగువ, మధ్య తరగతి నివాస వినియోగదారుల ప్రయోజనం లక్ష్యంగా సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లను పెద్ద ఎత్తున నెలకొల్పడానికి ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. సోలార్ రూఫ్‌టాప్ ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్రం ఆకర్షణీయమైన సబ్సిడీలు కూడా ఇస్తుండటం విశేషం. జిల్లాలో నెలకు 100 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే సర్వీస్‌లు 8.50 లక్షల వరకు ఉన్నాయి. మొదటి ప్రాధాన్యత కింద వీరి ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 400 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేశారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీయోజనతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనేది ప్రధాన ఉద్దేశం.


**సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటు ఇలా..**

- సరాసరి నెలవారీ విద్యుత్ వినియోగం 0–150 యూనిట్ల వరకు ఉంటే 1–2 కిలో వాట్స్ సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు కేంద్రం రూ.30 వేల సబ్సిడీ ఇస్తుంది.
- నెలకు విద్యుత్ వినియోగం 150–300 యూనిట్లు ఉంటే 2–3 కిలో వాట్స్ సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు రూ.60 వేల సబ్సిడీ వస్తుంది.
- నెలకు విద్యుత్ వినియోగం 300 యూనిట్లపైన ఉంటే 3 కిలోవాట్స్‌కుపైగా సామర్థ్యం ఉన్న సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటుకు అవకాశం. ఇందుకు రూ.78 వేల సబ్సిడీ లభిస్తుంది.
- సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్ సూర్యుడి వేడిని పీల్చుకోవడం వల్ల ఇళ్లు చల్లగా ఉంటాయి.
- వినియోగదారులు 5–6 ఏళ్లలో మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారు.
- www. pmsruryaghar.gov.in వెబ్‌సైట్‌లో వినియోగదారులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**డాక్యుమెంటేషన్ సరళీకృతం**

సౌర విద్యుత్ ఉత్పత్తికి దరఖాస్తులను నేషనల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దరఖాస్తు చేయడానికి ఆరు నెలలకు తక్కువ కాకుండా విద్యుత్ బిల్లుల కాపీలు జత చేయాలి. దరఖాస్తు అప్‌లోడ్ చేసి డిస్కమ్ క్లియరెన్స్ పొందిన తర్వాత వినియోగదారులు నమోదు చేసుకున్న వెండార్స్ నుంచి సోలార్ ప్లాంట్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంది. పని పూర్తయిన తర్వాత వినియోగదారులు నెట్ మీటరు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ 30 రోజుల్లో చెల్లిస్తారు.

**ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం**



సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్య లు చేపట్టాం. పీఎం సూర్య’ఘర్ ముఫ్త్ బిజ్లీయోజన ఉద్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. సౌర విద్యుత్ ఉత్పత్తికి సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుంటే సామర్థ్యాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుంది.

– ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ, ఉమ్మడి కర్నూలు జిల్లా